# నేను విన్న ఆకాశవాణి (నాటికా) కార్యక్రమాలు

రచన :- రోహిణి

జూన్ 19 రాత్రి మద్రాసు కేంద్రం నుంచి శ్రీ కాళహస్తీశ్వర మహాత్మ్యం నాటకం ప్రసారమైంది. రేఖా అండ్ మురళీ ఆర్టువారు రంగస్థలంమీద ప్రదర్శిస్తున్న నాటకాన్ని శుభగారు రేడియోకి సమర్పించారు. అన్నట్టు నేను నాటకం పేరు తప్పురాసినట్టున్నాను. ఇది కాళహస్తి మహాత్మ్యం. నాటకం బాగా నడిచింది. చక్కని కాలక్షేపం.

◆ ◆ ◆

జూన్ 21 రాత్రి అంగర సూర్యారావు గారు వ్రాసిన నేను ఉన్నాను. అనే నాటిక విజయవాడ కేంద్రం నుంచి ప్రసారమైంది. ఇందు శ్రీయుతులు బందా రామమోహనరావు వగైరా ప్రభృతులు పాల్గొన్నారు. నిర్వహణ శ్రీ బందా కనకలింగేశ్వరరావు, దేశం మీదికి వినోదయాత్రకు బయల్దేరిన ఇద్దరు యువకులకి ఓ కొండ మీది ఇంట్లో ఓ [illegible]రు కనిపించి "నేను ఉన్నాను" అనే కథ చెప్తాడు. ఈ కథ కథగా కాక నాటికగా వినపడ్తుంది శ్రోతలకు : నాటికలను ఈ టెక్నిక్‌తో నడపడం ఇది క్రొత్తకాదు. ఈ టెక్నిక్‌లో సినీమాలు వచ్చాయి. రంగస్థలంమీద ప్రదర్శించే నాటకాలు వచ్చాయి. రూపకాలకు ఈ మాదిరి టెక్నిక్ వాడుకోడానికి అవసరం : కథ చెప్పాల్సిన వ్యక్తి భూతమో, మాటలు రానివాడో, మంత్రవేత్తో అయినప్పుడు కలుగుతుంది। జరిగిన సంగతి కళ్ళకు కట్టినట్టు కథగాకూడా చెప్పవచ్చు. ఆవ్యక్తి సజీవుడూ, మాటలొచ్చినవాడూ. అయితే, చచ్చిపోయిన పాత్రను తీసుకొచ్చి నాటకం ఆడించక్కర్లేదు అథవా అలా ఆడించినప్పుడు తనులేని సంఘటనలు ఆ నాటకంలో ఉండకూడదు.

◆ ◆ ◆

జూన్ 23 రాత్రి విజయవాడ కేంద్రం నుంచి శ్రీ వింజమూరి శివ రామారావు రచించిన తళ్ళికోట నాటికను శ్రీ బందా కనకలింగేశ్వరరావు నిర్వహించారు. బసవరాజు సుబ్బారావు, సి. రామమోహనరావు, నాగరత్నమ్మగార్లూ, ఇతరులూ నటించారు. నాటిక బాగుంది. రక్తి కట్టింది. రామరాజుపాత్ర శ్రీ బందా కనకలింగేశ్వరరావు నిర్వహిస్తే ఎలా ఉండేదో.

◆ ◆ ◆

జులై 1 రాత్రి శ్రీ కంచి వాసుదేవరావు రచన అమ్మప్రాణం అనే నాటిక విజయవాడ కేంద్రం నుండి ప్రసారమైంది. గంజాయి వనంలో తులసిమొక్కలా లంచగొండితనం పంచుప్రీతి, దగా, మోసం, ప్రబలిపోయిన సంఘంలో మంచి వాళ్లుగా బ్రతకటంకూడా కష్టమే. అమ్మప్రాణం రక్షిద్దాం అనే సదుద్దేశ్యంతోనే డాక్టరుగారి డబ్బు తస్కరించి వారికే ఫీజుక్రింద ఇచ్చిన కారణమే తన తల్లి ప్రాణం తీసేస్తుంది, మంచి చెడుల నిరంతర సంఘర్షణల్లో 'చెడు' తాత్కాలిక విజయాలు పొందుతున్నట్టు కలిపించినా 'మంచి' మంచిగానే ఉంటూవస్తోంది మానవ చరిత్రలో. ఈ నాటికలోకూడా అదే నిరూపించ బడింది తాత్కాలిక ప్రయోజనానికి తహశీల్దారు ఉపయోగపడని కారణం డాక్టరులోని పైశాచికత్వాన్ని కాస్త రెచ్చగొట్టి ఫీజిగాని మందివ్వనని పట్టుబట్టించినా 'అమ్మప్రాణం' ఆ కుటుంబం నమ్మిన నీతి సూత్రాన్ని ఆచరణలో పెట్టడానికి బలి అవటంతో అతనిలోని మానవత్వం జయిస్తుంది. తల్లి తండ్రులులేని పిల్లని తాను ఆ పుణ్యదంపతుల ఆశయాలకు అనుగుణంగా పెంచుకుందాం అనే సత్సంకల్పం కలిగిస్తుంది. నాటిక బాగుంది. Flash Back సందర్భోచితంగా వాడుకోవడమే కాక కథకు పుష్టినిచ్చింది. ప్రయోగం నిర్దుష్టంగా లేదు. మూడు పాత్రలను ఒకే నటుడు నిర్వహించాడు. ఇలాటివి రేడియో నాటికలకు నప్పవు:

జులై 2 మధ్యాహ్నం మూడుగంటలకు లోగడ ప్రసారం ఐన "సీత" తాలూకు రికార్డు మళ్ళీ ప్రసారంచేసారు విజయవాడ కేంద్రం నుంచి ఇదివరకు సమీక్షింప బడింది.

—:o:—

# నీవు - నేను

జన్మ జన్మల ప్రగతి మనదీ
జగతిలో ప్రణయమ్ము మనదీ।
యుగ యుగమ్ముల సాగిపోదము
హృదయ బంధముతో।

నీ మనోహర రూపు నాదరి
నిలువగా నాలోన యేలనో
సృష్టి యంతయు యేలినంతటి
తృప్తి కలుగు నిదేమిటో।

నీ తీయని పలుకులందు - ధ్వ
నించు సుధా మధుర వాణి
నా వీనుల కెరుక పరచు
ననంత మైన ప్రబోధముల।

తుదియు మొదలు లేని జగతి
త్వదీయాకృతి యందున
ఇమిడి యుండి నీలో - చరి
యించు చుండు నని పించును।

నీవుంటివి నా కొరకే-
నా కొరకే నిను పొందితి
నీపై గల అనురక్తిలో
నాకున్న దిదే - విముక్తి।

యుగ యుగాల జగతిలోన
రక రకాల జన్మ లందు
సాగివచ్చు మన ప్రగాఢ - న
రాగమే ఒక విశ్వలీల।

రచన : పాతూరి ప్రసన్న.

Source: Press Academy Website, Chukkani, July 1961

Disclaimer: This topic/article/write-up has been posted here to increase the availability of some rare, forgotten and precious material for appreciation by a wider audience and with no intention what so ever of copy right violation. Request for removal of any copyrighted material, by the owner, will be promptly complied with.

Maganti Vamsi Mohan

http://www.maganti.org/